క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్‌లో కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు బాబ్జీయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నెల్లూరు(బారకాసు): వ్యాపారులు విధిగా దుకాణాల వద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. చిన్నబజారు, పెద్దబజారులోని పండ్ల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులందరూ చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని అందులోనే చెత్తను వేయాలని సూచించారు. వాటిని చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కంసాలివీధిలో డ్రైనేజీలో పూడికతీత పనులు, కోటమిట్ట, చిన్నబజార్ ప్రాంతాల్లోని మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

4న ఉచిత కంటి వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): ఈ నెల 4న విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐ లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురమందిరంలోని వర్ధమాన సమాజం హాల్లో ఉదయం 9 గంటల నుంచి జరిగే కంటి వైద్యశిబిరంలో సుశీల నేత్రాలయ డాక్టర్ సుధాకర్ కంటి పరీక్షలు చేస్తారన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమైన వారికి ఈహెచ్‌ఎస్, ఆరోగ్యశ్రీ కింద ఎలాంటి ఖర్చులేకుండా చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులతో పాటు పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షయ నియంత్రణలో వైద్యసిబ్బంది పాత్ర భేష్



కొడవలూరు: క్షయ నియంత్రణలో మండల వైద్య సిబ్బంది పాత్ర భేష్ అని జిల్లా క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ అన్నారు. కొడవలూరు పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. క్షయ, కుష్టు వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బందితో సమీక్షించారు. అనంతరం నార్నురాజుపాళెం, గుండాలమ్మపాళెం హెల్త్ క్లినిక్‌లను సందర్శించి వైద్య సేవలందిస్తున్నారా..లేదా అని పరిశీలించారు. సిబ్బంది సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు ఎం రామకృష్ణ, జీ బాలచంద్రబాబు, క్షయ, కుష్టు డివిజనల్ అధికారులు సత్యనారాయణ, నరసారెడ్డి, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఏలు షఫీఉద్దీన్, వెంకట్రావు పాల్గొన్నారు.

రత్నం కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ పరామర్శ



ఆత్మకూరురూరల్: రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీ రత్నం కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల రత్నం మరణించిన నేపథ్యంలో నెల్లూరులోని వారి నివాసంలో రత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రత్నంతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. రత్నం సతీమణి పద్మావతి, కుమారులు కొర్రపాటి వేణుగోపాల్, డాక్టర్ కృష్ణకిషోర్, తదితరులను పరామర్శించారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా నెల్లూరును తీర్చిదిద్దుతాం

• ఎంపీ విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, పక్కన నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్, తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అభివృద్ధికి కేరాఫ్‌గా నెల్లూరు జిల్లాను తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి, ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 52వ డివిజన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌తో కలిసి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించామన్నారు. విమానాశ్రయం, 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఔటర్ రింగ్ రోడ్డు, రోడ్ల విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం చేపడుతామన్నారు. నారాయణ, వేమిరెడ్డి ఇద్దరూ బడా వ్యాపారుల అన్నారు. విద్యను వ్యాపారంగా సాగిస్తున్న నారాయణ, ఇతర రాష్ట్రాలతో పాటు అనేక దేశాల్లో వ్యాపారాలు ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ వ్యాపారాలను తప్ప ప్రజల గోడును పట్టించుకోరన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నెల్లూరు అభివృద్ధికి రూ.5,200 కోట్లు ఖర్చు చేశామని నారాయణ గొప్పలు చెబుతున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. అభివృద్ధికి ఖర్చు చేశామని చెబుతున్న సొమ్ములో తన జేబులో ఎంత వేసుకున్నారో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, తాను వ్యాపారులం కాదని, ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తామన్నారు. తమను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

వలంటీర్లపై కక్ష గట్టిన చంద్రబాబు

పేద ప్రజల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబునాయుడు కక్ష గట్టారని విజయసాయిరెడ్డి అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దే పెన్షన్ అందించే ప్రక్రియను అడ్డుకుని తన కుటిల బుద్ధిని మరోసారి బయట పెట్టుకున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పెన్షన్ అందుకుంటున్న అవ్వతాతలు, అనారోగ్య బాధితులు మూడు నెలల పాటు సచివాలయం వద్దకు వెళ్లి పెన్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పేద ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేసే చంద్రబాబుకు, ఆయన పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. చంద్రబాబు తన 14 ఏళ్లపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అంధకారప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. సంపద సృష్టిస్తానని చెబుతున్న చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఎంత సంపద సృష్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన సంపద సృష్టించింది ఆయన కుటుంబ సభ్యులు, బంధు వర్గాలకు మాత్రమేనని, ప్రజల కోసం కాదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ 52వ డివిజన్ వైఎస్సార్‌సీపీకి కంచుకోట అన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు దాదాపు ప్రతి ఇంటికి అందాయన్నారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ నగరంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టారని వివరించారు. స్థానిక కార్పొరేటర్ డబ్బుకు ఆశపడి పార్టీని ఫిరాయించడం సరైన పద్ధతికాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో నిలుపుకున్నారని, ప్రజాభిమానాన్ని డబ్బుతో ఏ శక్తులు కొనలేవన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ మైనార్టీ సోదరులకు టికెట్టు ఇచ్చారని కోపంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరారన్నారు. అటువంటి వ్యక్తులను చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధి బాధిత బాలుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

నెల్లూరు(బారకాసు): కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పన్నెండేళ్ల బాలుడికి పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతనందించారు. సోమవారం నగరంలోని పవర్ యూత్ సొసైటీ కార్యాలయంలో బాలుడికి వైద్యఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.20 వేలు నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు మాట్లాడుతూ పొదలకూరు మండలానికి చెందిన పోతినేని మస్తాన్‌బాబు, లక్ష్మి దంపతుల కుమారుడు విజయ్ కాలేయ వ్యాధితో చెన్నైలోని కంచికామకోటి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి చికిత్సకు లక్షలాది రూపాయలు ఖర్చువుతుందని తెలిపారు. బాలుడి తల్లిదండ్రులది నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులకు అనేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకుని తమ వంతుగా ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకటసూర్య, సభ్యులు గిరీష్‌కుమార్, అఖిలాష్, వెంకటేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ, ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఏఐ విజయ కుమార్, ఏఆర్‌హెచ్‌సీ బీ వెంకటేశ్వర్లు, హెచ్‌జీ గౌరీమోహన్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగ విరమణ పొందిన వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఉద్యోగ విమరణ పొందిన సిబ్బంది శేషజీవితం హాయిగా గడపాలని ఆకాంక్షించారు. ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐ, పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతలను దీవించండి



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న హిమబిందు

నెల్లూరు సిటీ: త్వరలో జరిగే ఎన్నికల్లో అభివృద్ధి ప్రదాతలను ఆశీర్వదించాలని ఆదాల హిమబిందు కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమార్తె ఆదాల హిమబిందు 28వ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గత 9 నెలల్లో చేపట్టిన అభివృద్ధే ఆదాలను గెలిపిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 28వ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, వెంకటశ్రీధర్, రమణయ్య, కృష్ణప్రసాద్, మల్లికార్జున, కృష్ణమోహన్‌రెడ్డి, భార్గవిరెడ్డి, మోహన్‌నాయుడు, శివరామకృష్ణ, స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, వేలూరు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్క పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాలి



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ సీఎండీ సంతోషరావు, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రతిఒక్క పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత విద్యుత్ అధికారులు తనిఖీ చేసి విద్యుత్ సరఫరాకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరు నగరం, రూరల్ పరిధిలో సోమవారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాలు, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆయన వెంట ఇండస్ట్రియల్ విద్యుత్ సెక్షన్ కార్యాలయ ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఫిడే ఎరెనా టైటిల్ సాధించిన రామ్‌లిఖిత్



రామ్‌లిఖిత్‌ను అభినందిస్తున్న సుమన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన 8వ తరగతి విద్యార్థి మాస్టర్ రామ్‌లిఖిత్ ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించాడు. కోవిడ్ సమయంలో ప్రపంచ చదరంగ సమాఖ్య ఆన్‌లైన్ వేదికగా ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో రామ్‌లిఖిత్ సత్తా చాటి తొలిసారిగా జిల్లాకు ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించాడు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ రామ్‌లిఖిత్‌కు ఫిడే టైటిల్‌ను సోమవారం బహూకరించి సత్కరించారు. శిక్షణ అందించిన కోచ్ ప్రదీప్,ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంరాజేష్, దుర్గ, వీ ప్రదీప్, ఎస్ వెంకటేష్,అర్జున్‌బాలకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌కు మద్దతుగా నగరంలోని 53వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. 53వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి వెంగళ్‌రెడ్డి, నాయకులు విజయ్, బ్రహ్మారెడ్డి, బాలు, వెంకటరమణమ్మ, శిరీష, సరళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మధురం మురళి గానం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలో జరుగుతున్న 59వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ఏఎస్ మురళి శ్రీగణపతిని సేవింప రాడటే కీర్తనతో కచేరిని ప్రారంభించి తన మధురగానంతో సంగీతప్రియులను ఓలలాడించారు. ఆయన గాత్రానికి వీవీ శ్రీనివాసరావు (వయోలిన్), ఎన్ స్కంధసుబ్రహ్మణ్యం(మృదంగం), ఏఎస్ కృష్ణ (మోర్సింగ్) వాద్య, ఆర్ శ్యామ్‌సుందర్ గాత్ర సహకారాన్ని అందించారు. స్మరణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు హరికథ గానం, స్థానిక ఔత్సాహిక కళాకారులు గాత్ర, వీణ, వయోలిన్‌తో ఆలపించిన కీర్తనలు సభికుల హర్షధ్వానాలు అందుకున్నాయి. ఈ కార్యక్రమాలను బిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిస్వార్థ ప్రజాసేవకులపై టీడీపీ కక్ష సాధింపు



41వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో చేరిన చౌటుమిట్టవాసులతో ఆదాల

నెల్లూరు సిటీ: నిస్వార్థ ప్రజాసేవకులైన వలంటీర్లపై టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్‌లో సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మేకవన్నె పులి వంటి వారన్నారు. గడప గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తే ప్రజలు తనకు ఓటేయరనే భయంతో వలంటీర్ వ్యవస్థను లేకుండా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను అడ్డుకుని పింఛన్ లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు బాబ్జీయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డివిజన్ నాయకులు బీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వేలూరు గోపీప్రసాద్, శీను, ఏడుకొండలు, రాజా, సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, ఏసునాయుడు, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాల చేరిక

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ చౌటుమిట్ట ప్రాంతానికి చెందిన 25 కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. 31వ డివిజన్ ఇన్‌చార్జి ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నగరంలోని ఆదాల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలను జీర్ణించుకోలేక టీడీపీ కుట్ర



బుజబుజనెల్లూరులో ప్రచారం చేస్తున్న మేయర్ స్రవంతి

• మేయర్ స్రవంతి జయవర్ధన్

నెల్లూరు(బారకాసు): నిస్వార్థంగా వలంటీర్లు అందిస్తున్న సేవలను జీర్ణించుకోలేక టీడీపీ ఈసీకి ఫిర్యాదు చేసి వారిని విధులకు దూరం చేసి కక్ష సాధింపునకు పాల్పడిందని మేయర్ పొట్లూరి స్రవంతి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా బుజబుజనెల్లూరులో సోమవారం మేయర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా గడప గడపకు అందుతున్న సంక్షేమాన్ని అడ్డుకునేందుకే టీడీపీ కుట్రలకు పాల్పడిందన్నారు. వలంటీర్లను దూరం చేయడం ద్వారా ప్రతి నెలా ఇంటి వద్దే పెన్షన్లు అందుకుంటున్న అవ్వతాతలను సచివాలయాల వద్ద పడిగాపులు కాసేలా చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, 25వ డివిజన్ ఇన్‌చార్జి నవాబ్‌జాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లపై కక్ష తీర్చుకున్న చంద్రబాబు



21వ డివిజన్ ప్రజలతో మమేకమైన మొయిళ్ల గౌరి

నెల్లూరు(బారకాసు): నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై అక్కసుతో ఈసీకి ఫిర్యాదు చేయించి వారిని విధులకు దూరంగా పెట్టించి చంద్రబాబు తన కక్ష తీర్చుకున్నారని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. సోమవారం ఆమె 21వ డివిజన్‌లో పర్యటించి స్థానిక ప్రజలతో మమేకమై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంటింటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు ఆది నుంచి అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై వేయని నిందలు, చేయని ఆరోపణలు లేవన్నారు. చంద్రబాబు వలంటీర్లు చేసేది గోనె సంచులు మోసే ఉద్యోగమని అవహేళన చేయగా, పవన్ కల్యాణ్ వలంటీర్ల వల్ల హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతోందని ఆరోపణలు చేశారన్నారు. వలంటీర్లకు భయపడి చంద్రబాబు మరింతగా దిగజారి నిమ్మగడ్డ ద్వారా ఈసీకి ఫిర్యాదు చేసి వారి సేవలను అడ్డుకున్నారన్నారు. తద్వారా ఇంటి వద్దే పింఛన్ అందుకుంటున్న నడవలేని స్థితిలో ఉన్న లక్షలాది మంది అవ్వతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆగ్రహ జ్వాలల్లో టీడీపీ కూటమి కొట్టుకుపోవడం తథ్యన్నారు.

వారికి అండగా నిలుద్దాం

- చిన్నారుల్లో ఆటిజం ముప్పు
- నెల్లూరులో బాల భవిత కేంద్రం
- సాధారణ స్థితికి తెచ్చేందుకు ఉచితంగా శిక్షణ
- నేడు ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ డే



బాల భవిత కేంద్రంలో చిన్నారికి శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణురాలు

నెల్లూరు(అర్బన్): కొందరు పిల్లలు అందరితో కలవరు. తమ లోకంలో ఉంటారు. ఒంటరిగా ఆడుకుంటుంటారు. వినికిడి సాధారణంగా ఉన్నా పేరు పెట్టి పిలిస్తే పలకరు. పెద్ద పెద్ద శబ్దాలు చేస్తుంటారు. ఇవన్నీ ఆటిజం లక్షణాలు. ఆ పిల్లల తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతుంటారు. కానీ ఆటిజంకు గురైన పిల్లలకు అండగా ఉండాలి. నేడు ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ డే. ఈ ఏడాది నేవీ బ్లూ అనే కలర్‌ను థీమ్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో బాల భవిత కేంద్రం ఉంది. దీని ద్వారా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా ఆటిజంకు గురైన పిల్లలకు శిక్షణ ఇస్తూ సాధారణ స్థితికి తెస్తున్నారు. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 235 మందిని గుర్తించారు. ప్రతి ఐదుగురిలో నలుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల గురవుతున్నట్లు తేలింది. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో ఇటీవల ఏర్పాటు చేసిన మరో బాల భవిత కేంద్రానికి సైతం పదుల సంఖ్యలో ఆటిజం పిల్లలు వస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు అధికంగా చూస్తున్న వారు ఆటిజం సమస్యకు గురవుతున్నట్లు గుర్తించారు. దాని బారిన పడుతున్న వారు పట్టణాల్లోనే అధికంగా ఉన్నారు. అయితే అనేక మందికి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాల భవిత కేంద్రాల గురించి తెలియక చెన్నై, హైదరాబాద్ లాంటి నగరాలకు పిల్లలను వైద్యం కోసం తీసుకెళ్లి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇలాంటి వారి వివరాలు వైద్యశాఖలో నమోదు కావడం లేదు.

అత్యున్నత శిక్షణ

నగరంలోని పెద్దాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విశాలమైన బాల భవిత కేంద్రంలో ఆటిజం ఉన్న వారికి, సకాలంలో మాట్లాడలేని వారికి, వినికిడి లోపం ఉన్న వారికి అత్యున్నత శిక్షణ ఇస్తున్నారు. డాక్టర్లతోపాటు 17 మంది సిబ్బంది ఉన్నారు. ఇలాంటి పిల్లల కోసం ప్రభుత్వం ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చి సాధారణ బిడ్డలుగా మార్చేందుకు కృషి చేస్తోంది.

ఉచితంగా శిక్షణ



“ ఆటిజంకు 15 నుంచి 20 శాతం వరకు జన్యుపరమైన అంశాలు కారణం. ఎక్కువ మంది గురికావడానికి కారణాలు స్పష్టంగా తెలియదు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు అల్లరి చేయకుండా స్మార్ట్ ఫోన్లు ఇస్తున్నారు. తమ దగ్గరకు వచ్చిన వారిని పరిశీలిస్తే ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ స్క్రీన్లకు గంటల తరబడి అతుక్కుపోయినట్లు తెలుస్తోంది. అందువల్ల పిల్లలను వాటికి దూరంగా ఉంచాలి. 3 నుంచి 10 ఏళ్లలోపు పిల్లలు రోజూ అరగంట మాత్రమే ఫోన్ స్క్రీన్‌ను చూసేందుకు అనుమతించాలి. ఆటిజం ఉండే పిల్లలను సకాలంలో కేంద్రానికి తీసుకొస్తే ఉచిత శిక్షణ ఇస్తాం. ఎంతో మందిని సాధారణ స్థితికి తీసుకొచ్చాం.

– డాక్టర్ సురేష్‌బాబు, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, బాల భవిత కేంద్రం